మున్సిపల్ దుకాణాలకు వేలం

ఆదిలాబాద్ రూరల్, అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ పుర పాలక శాఖకు చెందిన 17 దుకాణాలను అద్దె ప్రాతిపదికన నిర్వహించేందుకు వేలంపాట నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ఖమర్ తెలిపారు. పాత మున్సిపల్ ఆఫీస్‌లో 13, పాత బస్టాండ్‌లో 2, శివాజీ చౌక్‌లో 2 షాప్స్ ఉన్నాయన్నారు. ఆసక్తి గల వారు ఈనెల 30 లోపు కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. నవంబర్ 2న మున్సిపల్ కార్యాలయంలో వేలం ప్రక్రియ ఉంటుందన్నారు.



ఆదిలాబాద్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి కేటీఆర్, వేదికపై ఎమ్మెల్యేలు పార్టీ నాయకులు

రైతు పోరుబాటకు హాజరైన ప్రజలు

రైతు పోరుబాట

సక్సెస్

ఆదిలాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : బీఆర్‌ఎస్ పార్టీ అధికారానికి దూరమైన తర్వాత తొలిసారి జిల్లాలో నిర్వహించిన రైతు పోరుబాట సక్సెస్ అయ్యింది. రైతు సమస్యలే ప్రధాన ఎజెండాగా నిర్వహించిన సభకు ఉమ్మడి జిల్లా నుంచి వేలాదిగా రైతులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో నిర్వహించిన రైతు పోరుబాట సభకు సుమారుగా 10వేల వరకు జనం వచ్చి ఉంటారని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ సభకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరయ్యారు. ఆయనతో పాటు మాజీ మంత్రి జోగు రామన్న, బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి, కోరుట్ల ఎమ్మెల్యే డా.సంజయ్, హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ తదితరులు హాజరయ్యారు. సభా ఉదయం 11గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా మధ్యాహ్నం 1.30 గంటలకు ప్రారంభమైంది.కొంత ఆలస్యమైన మాజీ మంత్రి కేటీఆర్ ప్రసంగం కోసం అందరు ఆసక్తిగా ఎదురు చూశా రు. ఎమ్మెల్యేలు అనిల్‌జాదవ్, కోవలక్ష్మీ, మాజీ మంత్రి జోగు రామన్నలు ప్రభుత్వ తీరును తప్పుబడుతూ ప్రసంగించారు. అలాగే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై హాట్ కామెంట్ చేయడం బీఆర్ఎస్ కార్యకర్తల్లో జోష్ నింపింది. ఇక పై రైతు సమస్యలపై పోరాడేందుకు బీఆర్ఎస్ సిద్ధంగా ఉంటుందని నేతలు ముక్త కంఠంతో ప్రకటించారు. ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీ హామీలను అమలు చేయాలని నేతలు డిమాండ్ చేశారు. ముఖ్యంగా పంటల

(మిగతా 6వ పేజీలో)

పోరుబాటకు ఆదిలాబాద్ దారి చూపింది : మాజీ మంత్రి కేటీఆర్



రాష్ట్ర వ్యాప్తంగా రైతు సమస్యలపై పోరాడేందుకు ఆదిలాబాద్ పోరుబాట చూపిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. మళ్లీ వచ్చేది మా ప్రభుత్వమే. ఎవరిని వదిలి పెట్టేది లేదు. పోలీసులైనా, అధికారులైనా అతి చేస్తే పేర్లు రాసిపెట్టుకుని మరి అధికారంలోకి రాగానే మిత్తితో సహా చెల్లిస్తామంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ వస్తుండగా డిచ్‌పెల్లి బెటాలియన్ ముందు పోలీసోళ్ల భార్యలు, పిల్లలు ధర్నా చేస్తున్నారు. ఈ కాంగ్రెస్ పాలనలో పోలీసుల కుటుంబాలు పోలీసులతోనే దెబ్బలు తినే పరిస్థితి ఏర్పడింది. కాంగ్రెస్ నేతలు పెట్టే కేసులకు భయపడేది లేదు. ప్రజల కోసం ఏడాది రెండేళ్ల జైలుకైనా వెళ్లడానికి సిద్ధంగానే ఉన్నాం. త్వరలో ప్రజలు తిరగబడి కాంగ్రెస్ వాళ్లను ఊళ్లలో ఉరికించి కొట్టే రోజులు దగ్గర పడ్డాయి. కల్యాణలక్ష్మీతో తులం బంగారం ఇస్తామని చెప్పిన 420 సీఎం పై కేసులు ఎందుకు పెట్టకూడదో చెప్పాలి. హైడ్రా పేరుతో ఇళ్ల నిర్మాణాలను కూల్చివేస్తుంటే కడుపు కాలి ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెట్టి జైళ్లలో పెట్టడం ఎంత వరకు సమంజసమన్నారు. త్వరలోనే మహారాష్ట్రలో ఎన్నికలు జరుగుతాయి. ఈ కాంగ్రెస్ మోసాలను అక్కడి వాళ్లకు కూడా చెప్పండి. అక్కడ కాంగ్రెస్ వాళ్లు మళ్లీ మోసం చేసే అవకాశం ఉంది. అక్షర క్రమంలో ముందున్న ఆదిలాబాద్ ఆనాడు తెలంగాణ ఉద్యమంలో కీలకంగా మారింది. ఆరు గ్యారంటీల పై ముఖ్ర(కె) గ్రామస్థులు పోస్టుకార్డు ఉద్యమాన్ని ప్రారంభించారు. రుణమాఫీ చేయడం లేదని ప్రశ్నించిన రుయ్యాడి రైతుల పై కేసులు పెట్టారు. రైతులు భయపడవద్దు రైతుల పక్షాన ఉండి మేము పోరాడుతాం. గుజరాత్‌లో పత్తికి చెల్లిస్తున్న రూ.8,800ల మద్దతు ధరను ఆదిలాబాద్ జిల్లాలోను చెల్లించాలి లేదంటే ఊరుకునేదే లేదు. దేశంలోనే తెలంగాణ పత్తికి భారీగా డిమాండ్ ఉంది. ఎన్నికల సమయంలో సీసీఐని పునరుద్ధరిస్తామని చెప్పిన బీజేపీ ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. సన్న ధాన్యానికి బోనస్ ఇస్తామని చెప్పిన ఎవరికి రాలేదన్నారు. బోనస్ బోగస్‌గా మారిందన్నారు. రైతుభరోసా ఇస్తామని చెప్పిన సీఎం కుర్చీకే భరోసా లేదన్నారు. బీఆర్ఎస్ భారతీయ రాష్ట్ర సమితి కాదని భారత రైతు సమితి అని రైతుల పక్షాన ఉండి కొట్లాడాలన్నారు. బెల్లంపల్లి పై కూడా ఆదాని కన్ను పడిందని, దేవాపూర్‌లోని ఓరియంట్ సిమెంట్ ఫ్యాక్టరీని కొనుగోలు చేసే ప్రయత్నం జరుగుతుందన్నారు. ఆ తర్వాత ఆదిలాబాద్ సీసీఐ, సింగరేణి పరిశ్రమలను దక్కించుకునే కుట్రలు జరుగుతున్నాయన్నారు. తెలంగాణను కాపాడే ఒకే ఒక శక్తి కేసీఆరేనని మరెవరు దిక్కు లేరన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి జోగు రామన్న, ఎమ్మెల్యేలు అనిల్‌జాదవ్, కోవలక్ష్మి, కౌశిక్ రెడ్డి, డాక్టర్.సంజయ్, మాజీ ఎమ్మెల్యేలు చిన్నయ్య, బాల్క సుమన్, మాజీ జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, రాంకిషన్‌రెడ్డి, శ్యాంసుందర్, జాన్సన్‌నాయక్, మాజీ మున్సిపల్ చైర్మన్ మనీషా, రమాదేవి, మర్సకోల సరస్వతి తదితరులున్నారు.

ముఖ్యమంత్రి పై కేసులు పెట్టాలి : మాజీ మంత్రి జోగు రామన్న



ప్రజలను మోసం చేసిన 420 ముఖ్యమంత్రిపై పోలీసులు ఎందుకు కేసులు పెట్టడం లేదో అర్థం కావడం లేదు. అధికారంలోకి వస్తే వెంబడే రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి మోసం చేశాడు. సీఎం నెంబర్ వన్ బట్టెబాజ్ అయితే నెంబర్ 2 బట్టే బాజ్ ఢిల్లీలో ఉన్నాడు. మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు పూర్తిగా జరిగి పోయాడు. ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పిస్తామన్న రాహుల్‌గాంధీ హామీలు ఏమయ్యాయి. రాజ్యాంగం పై ప్రమాణం చేసి చెప్పిన రాహుల్‌గాంధీ మాటలకే దిక్కులేదు. ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకుంటానని అన్న సీఎం మాటలు ఏమయ్యాయి.

రేవంత్‌రెడ్డి మాటలు బోథ్ ప్రజలు నమ్మలేదు : అనిల్ జాదవ్, బోథ్ ఎమ్మెల్యే



గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను రెండింతలు చేస్తామని బూటకపు హామీలు ఇచ్చిన రేవంత్‌రెడ్డి మాటలను బోథ్ ప్రజలు మాత్రం నమ్మలేదు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన రైతుబంధు రాలేదు. పంటల రుణమాఫీ కాలేదని రైతులు అడుగుతున్నారు. కల్యాణలక్ష్మీతో ఇచ్చే తులం బంగారం ఏమైందంటూ ప్రజలు ప్రశ్నించే పరిస్థితి వచ్చింది. పొట్టి మనిషి ఎన్నో హామీలు ఇచ్చాడు కదా అంటూ ప్రజలు అడుగుతున్నారు. బతుకమ్మ పండుగ ముగిసినా చీరలు మాత్రం ఇవ్వలేదు.

గ్రామాల అభివృద్ధి ఏమైంది : కోవలక్ష్మి, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే



అధికారంలోకి వస్తే మారుమూల గ్రామాలను అభివృద్ధి చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం అసలు గ్రామాల అభివృద్ధికి నిధులే కేటాయించడం లేదు. వంద హామీలు ఇచ్చారు. ఆరు గ్యారంటీలను అమలు చేయడం లేదు. ఇప్పటి వరకు రైతుభరోసా పేరిట రూ.15వేలు ఇవ్వలేదు.

నేడు కుమ్రం సూరు వర్ధంతి

- కొమురం భీమ్ అనుచరుడు
- హాజరుకానున్న కలెక్టర్, ప్రజా ప్రతినిధులు



కోలాంగూడలో ఏర్పాటు చేసిన సూరు విగ్రహం

ఉట్నూర్, అక్టోబరు 24 : ఉమ్మడి జిల్లాలోని జోడేఘాట్ అడవుల్లో ఆదివాసీ గిరిజనుల హక్కుల కోసం నిజాం సైన్యంతో పోరాడిన అమరుడు కొమురం భీమ్ అనుచరుడైన కుమ్రం సూరు వర్ధంతి ఉట్నూర్ మండలంలోని కోలాంగూడలో శుక్రవారం జరుగనుంది. కోలం వీరరత్న కుమ్రం సూరు వర్ధంతి కమిటీ చైర్మన్ టేకం భీమ్‌రావు, కన్వీనర్ కుమ్రరాజు ల ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తిచేస్తున్నారు.

భీమ్ అనుచరుడుగా....

దేశాన్ని బ్రిటిష్ వారు పరిపాలిస్తున్న సమయంలో తెలంగాణ ప్రాంతం నైజాం నవాబుల పాలనలో ఉండింది. సూరు కెరమెరి మండంలోని జోడిఘాట్‌లో కుమరంచిన్ను, మారుబాయి దంపతులకు 1916లో జన్మించారు. ఆదివాసీ గిరిజనులపై జరుగుతున్న అక్రమాలను, దౌర్జన్యాలను, ఎదుర్కొవడానికి జోడేఘాట్ ప్రాంతంలోని 12 గ్రామాలకు స్వేచ్ఛా స్వాతంత్రాలు కల్పించి ఆదివాసీ గిరిజనులకు పూర్తిహక్కులు కల్పించాలని, నిజాం నిరంకుశ చెప్పాలన్న పై కొమురంభీం పోరాటం చేయగా కుమరం సూరు ఆయనకు అండగా ఉండి పోరు సలిపారు. 1945లో నిజం సైనికులు జరిపిన కాల్పుల్లో అనూయపూర్ణం రోజున గోండు వీరుడు కొమురంభీం వీరమరణం పొందారు. ఈ కాల్పుల్లో కుడిచేయి కుడి కాలుకు గాయాలకు సురు ప్రాణులతో బయటపడి ఆరునెలల పాటు అజ్ఞాతవాసం గడిపారు. స్వాతంత్రం వచ్చిన తర్వాత భీము పోరాటాన్ని ఆయన చరిత్రను, ఆదివాసుల హక్కుల కోసం ఆయన చేసినపోరాట పటిమను ప్రభుత్వానికి అధికారులకు తెలిపిన కోలాం వీరరత్న కుమురం సూరు 1997లో ఉమ్మడి జిల్లాలోని ఆసిఫాబాద్ మండలం సేకన్ గోండి గ్రామంలో స్వర్గస్థులయ్యారు. ప్రతియేటా కొమురంభీం వర్ధంతి అనంతరం ఐటీడీఏ అధికారుల సహాయంతో మండలంలోని కోలాం గూడలో వర్ధంతి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

- **రానున్న కలెక్టర్, ప్రజా ప్రతినిధులు...**

మండలంలోని కోలాంగూడలో శుక్రవారం జరుగనున్న సూరువర్ధంతి కార్య క్రమానికి కలెక్టర్ రాజార్షి, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బు గుప్తా, జిల్లా ఎస్పీ గౌస్‌ఆలంతో పాటు ఆదిలాబాద్ ఎంపీ గోడంనగేష్, ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జుపటేల్, కోవలక్ష్మిలతో పాటు పలువురు ఆదివాసీ నాయకులు, ప్రజా ప్రతి నిధులు హాజరుఅవుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



అధ్వానంగా ఉన్న మురుగుకాలువ

ఇచ్చోడ పట్టణంలో మౌలిక వసతులు కరువు

- ఇచ్చోడ పట్టణంలోని పలు కాలనీల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. అంతర్గత దారులు అధ్వానంగా మారగా.. మురుగు కాల్వలు సక్రమంగా లేవు.

7



ఉత్సవాల్లో పాల్గొన్న ఆదివాసీలు

దండారీ ఉత్సవాలు ప్రారంభం

- ఆదివాసీ గిరిజనులు నిర్వహించే భోగి పూజలతో గుస్సాడీ దండారీ సంబరాలు ప్రారంభమయ్యాయి.

6



ప్రమాదకరమైన మలుపు

ప్రమాదకరంగా మూలమలుపులు

- గుడిహత్నూర్ మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులపై మూలమలుపులు ప్రమాదకరంగా మారాయి.

6

గిరిజన పోషణ మిత్ర అమలు చేయాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా



మాట్లాడుతున్న పీఓ ఖుష్బుగుప్తా

ఉట్నూర్, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలోని పాఠశాలలో చదువుకుంటున్న గిరిజన పిల్లలకు గిరిజన పోషణ మిత్ర పథకం ద్వారా మెరుగైన విద్య వైద్యం అందించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అధికారులను ఆదేశించారు. ఉమ్మడి జిల్లాల ఆశ్రమ పాఠశాల ఏఎన్ఎంలకు వార్డెన్‌లకు ఆదేశించారు. గురువారం కొమురంభీం ప్రాంగణంలోని పీఎంఆర్‌సీ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన పోషణ మిత్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. గిరిజన పోషణ మిత్ర ద్వారా విద్యార్థులకు 100 శాతం స్క్రీనింగ్ టెస్టులు జరిపించాలన్నారు. విద్యార్థులకు అందిస్తున్న వైద్యంలో రక్త హీనత లేకుండా రక్తపరీక్షలు నిర్వహించాలని నాలుగు జిల్లాల డీఎంహెచ్‌వో లకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో 4 జిల్లాల డీఎంహెచ్‌ఓలు, ఏడీఎంహెచ్‌ఓ మనోహార్, ఏపీవో జనరల్ జాదవ్ వసంతరావు, టీటీడీఓలు రమాదేవి, గంగారాం, అంబాజి, ఉమ్మడి జిల్లాల ఏటీడీఓలు, జీసీడీఓలు, ఆశ్రమ పాఠశాలల వార్డెన్‌లు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

రైల్వేలైన్ పనులు పూర్తి చేయండి

- దక్షిణ మధ్య రైల్వే సమావేశంలో ఎంపీ గోడం నగేష్



దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని ఎంపీల సమావేశంలో పాల్గొన్న ఎంపీ

ఆదిలాబాద్‌అర్బన్, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన పార్లమెంట్ సభ్యులు గురువారం హైదరాబాద్‌లోని రైల్వేనిలయంలో సమావేశమయ్యారు. సమావేశానికి ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడంనగేష్ హాజరై పలు అంశాలపై చర్చించారు. ముఖ్యంగా ఆదిలాబాద్ టూ ఆర్మూర్ రైల్వేలైన్ పనులపై అధికారుల దృష్టికి ఎంపీ తీసుకెళ్లారు. ప్రస్తుతం ఈ లైన్ ఫైనల్ లోకేషన్స్ సర్వే కొనసాగుతుందని త్వరలోనే సర్వేను పూర్తి చేసి డీపీఆర్ డిటెయిల్స్ ఎస్టిమేషన్ జనవరిలోపు రైల్వే బోర్డుకు అందజేసే అవకాశం ఉందన్నారు. కాజిపేట బల్లార్ష మధ్య రెబ్బెల వద్ద ఎల్‌సీ నెంబర్ 71 ఫ్లై ఓవర్ నిర్మాణానికి రైల్వే బోర్డు నిధులను మంజూరు చేసిందన్నారు. బాసర ఆదిలాబాద్‌రైల్వే స్టేషన్ల ఆధునీకరణ వసతుల కల్పనకు అమృత్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. బాసర స్టేషన్‌కు 11.33 కోట్లు, ఆదిలబాద్‌స్టేషన్‌కు 17.76కోట్లు నిధులు మంజూరైనట్లు తెలిపారు. అలాగే బాసరలో ఐఐటీ ఉన్నందున బాసర మీదుగా వెళ్లే అన్ని రకాల రైళ్లు నిలిపేందుకు హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ముతికేట్ పిప్పల్‌కోటి రైల్వేలైన్ సర్వే కోసం నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఇటీవల సికింద్రాబాద్ టూ నాగపూర్ వెళ్లే వందే భారత్ రైలును కాగజ్‌నగర్ వద్ద నిలిపేందుకు అధికారులు హామీ ఇచ్చినట్లు తెలిపారు.

గుడుంబా తయారీదారులకు లక్ష రూపాయల జరిమానా

బోథ్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా నాటుసారా తయారు చేసి పలుమార్లు విక్రయించిన వారికి పట్టుకుని ఎక్సైజ్ అధికారులు గురువారం లక్ష రూపాయల జరిమానా విధించడం జరిగిందని ఎక్సైజ్ సీఐ జల్పికర్ అహ్మద్ తెలిపారు. బోథ్ మండలంలోని నిగిని గ్రామానికి చెందిన జాదవ్ అనూష బాయ్ అనే మహిళా పలుమార్లు గుడుంబా తయారు చేసి దొరకడంతో తహసీల్దార్ వద్ద యాభై వేల జరిమాన విధించినట్లు సీఐ తెలిపారు. అంతేగాక ఇచ్చోడ మండలం జాల్దా గ్రామానికి చెందిన భీమ్‌లాల్‌కు సైతం 50 వేల జరిమానా ఇచ్చోడ తహసీల్దార్ విధించడం జరిగిందన్నారు. జరిమానాలను చలాన్ రూపంలో అందించడం జరిగిందన్నారు.

నేటి నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభం

- మార్కెట్‌యార్డ్‌ను సిద్ధం చేసిన అధికారులు



కొనుగోళ్లకు సిద్ధం చేసిన మార్కెట్‌యార్డు

ఆదిలాబాద్‌అర్బన్, అక్టోబర్24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోనే పత్తి పంట సాగుకు కేంద్ర బిందువైన ఆదిలాబాద్ జిల్లాలో తెల్ల బంగారం కొనుగోళ్లకు మార్కెటింగ్ అధికారులు సర్వం సిద్ధం చేశారు. కాగా ఈ నెల 25 నుంచి పత్తి కొనుగోళ్లను ప్రారంభించనున్నారు. ఈ యేడు జిల్లాలో 4లక్షల పై చిలుకు ఎకరాల్లో పత్తి పంట సాగైనట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే పత్తి కొనుగోళ్ల పై దృష్టి సారించిన జిల్లా కలెక్టర్ రాజార్షిషా రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు అప్రమత్తమవుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో పత్తికి భారీ డిమాండ్ ఉంది. జిల్లా వ్యాప్తంగా ఈ సారి పలు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు.

వేతనాలు చెల్లించాలని అంగన్‌వాడీల ధర్నా



ఉట్నూర్‌లో ఎమ్మెల్యే పీఏకు మెమోరాండం అందిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

ఉట్నూర్, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి) :అంగన్‌వాడీ సెంటర్ల టీచర్లకు ఐదునెలల పెండింగ్ వేతనాలు చెల్లిం చాలంటూ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో ఉట్నూర్ మండల కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లు గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్స్ అండ్ వెల్ఫేర్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి సీఐటీయూ కో-కన్వీనర్ శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో 4వేల మిని అంగన్‌వాడీ సెంటర్లను మెయిన్ అంగన్‌వాడీ సెంటర్లుగా మార్చిన ప్రభుత్వం గత ఐదు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదన్నారు. పెండింగ్ వేతనాలు చెల్లించడంతో పాటు అంగన్‌వాడీ సెంటర్లకు హెల్పర్లను నియమించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని మంత్రులకు అధికారులకు ఎన్నిసార్లు వినతి పత్రాలు ఇచ్చిన ఫలితం లేకుండా పోతుందన్నారు. అంగన్‌వాడీ టీచర్ల సమస్యల పరిష్కారం కోసం నవంబర్‌లో రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడతామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్యేక సహాయకులు భుజంగరావుకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్షురాలు రత్నమాల, ముక్తానంద, పార్వతి, ఉజ్వల, భారతి, హంస తదితరులు పాల్గొన్నారు.

కూలి డబ్బుల కోసం గొడవ : ఒకరి మృతి



శేఖర్ మృతదేహం

నేరడిగొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలో కూలిడబ్బుల కోసం గురు వారం జరిగిన గొడవలో ఒకరు మృతిచెందారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన గుండెటి శేఖర్ (34) గత కొంత కాలంగా బత్తుల వెం కటేశ్ (మేస్త్రి) వద్ద కూలీ పనిచేసే వాడు. దాదాపు మూడువేల రూపాయలు కూలిడబ్బులు రావాల్సి ఉండే ది. రెండువారాలుగా కూలీ డబ్బులు ఇవ్వాలని శేఖర్ వెంకటేశ్‌ను అడుగు తున్నాడు. గురువారం రాజస్థాన్ హోటల్ వద్ద ఈ విషయమై వెంకటేశ్‌ను అడగగా డబ్బులు ఇచ్చేది లేనని చెప్పడంతో ఇరువురి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో వెంకటేశ్, శేఖర్ మేడలో ఉన్న నల్లధారాన్ని గట్టిగా పట్టుకొని నెట్టివేయడంతో కింద పడిపోయాడు. తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో బోథ్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడని వైద్యాధికారి చెప్పాడు. కుటుంబసభ్యుల ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నామని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

పోలీసుల సేవలు అభినందనీయం : సబ్‌కలెక్టర్



ఉట్నూర్‌లో 2కే రన్‌లో పాల్గొన్న సబ్ కలెక్టర్, డీఎస్పీలు

ఉట్నూర్, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి) : పోలీసుల సేవలు అభినందనీయమని ఉట్నూర్ సబ్‌కలెక్టర్ యువరాజ్ మర్మాట్ అన్నారు. గురువారం పోలీసు అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకొని ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 2కే రన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణం నుంచి వినాయకచౌక్ వరకు నిర్వహించిన టూ కేరన్ ప్రారంభించి మాట్లాడారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం పోలీసులు అహర్నిశలు శ్రమిస్తున్నారని, ప్రజలు పోలీసుల సేవలు గుర్తించాలన్నారు. కార్యక్రమంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గండికోట మొగిలి, ఉట్నూర్ సబ్ ఇన్‌స్పెక్టర్ మనోహార్ పాల్గొన్నారు.

ట్రైని కలెక్టర్లకు సహకరించాలి : మున్సిపల్ కమిషనర్

ఆదిలాబాద్ రూరల్, అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి) : ట్రైనీ కలెక్టర్లు జిల్లాకు సందర్శనకు వచ్చిన నేపథ్యంలో అధికారులు వారికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. ట్రైనీ కలెక్టర్లకు సహకరించాలని సూచించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కేటీఆర్ చేతికి గాయం



కేటీఆర్ వచ్చిందే తడవు అభిమానులు, కార్యకర్తలు కేరింతలు కొడుతు చుట్టుముట్టారు. దగ్గరికి వచ్చేందుకు ప్రయత్నించారు. కరచాలనం చేసే ప్రయత్నంలో ఎవరియో గోళ్లు చిన్నగా కేటీఆర్ చేతికి గాయం చేశాయి. దీంతో సభలో ఆ చిన్న గాయానికి కేటీఆర్ జెల్ రాశారు.

(ఆంధ్రజ్యోతి, ఆదిలాబాద్ స్టాఫ్‌ఫొటోగ్రాఫర్)

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న దృశ్యం

ఇచ్చోడ, అక్టోబరు, 24(ఆంధ్రజ్యోతి): బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న చిన్నారి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని జల్దా గ్రామానికి చెందిన అల్లం రమకుమారి ఇచ్చోడలోని విద్యాలయ పాఠశాలలో చదువుకుంటుంది. కొద్దిరోజుల నుంచి అనారోగ్యాంతో బాధపడుతున్న చిన్నారిని కుటుంబసభ్యులు నిజామాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసు కెళ్లగా.. చిన్నారికి బ్రెయిన్ ట్యూమర్ అని వైద్యులు చెప్పడంతో నిరుపేద కుటుంబం దిక్కుతోచని పరిస్థితిలో పడింది. దీంతో వైద్యం కోసం ఖర్చుల నిమిత్తం చదువుతున్న పాఠశాల కరస్పాండెంట్, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు దాతల రూపంలో ముందుకు వచ్చారు. దీంతో గురువారం మార శ్యాంరెడ్డి నిజామాబాద్‌లోని ఆసుపత్రికి వెళ్లి రూ.90వేల నగదును అందజేశారు.

రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఎంపీడీవోకు వినతి

తలమడుగు , అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పది సంవత్సరాలుగా అసంపూర్తిగా ఉన్న రోడ్డునిర్మాణ పనులతో దుమ్ము లేస్తుందని గురువారం తలమడుగు గ్రామానికి చెందిన యువకులు ఎంపీడీవో చంద్రశేఖర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ మండల కేంద్రంలో పది సంవత్సరాలుగా అసంపూర్తిగా ఉన్న రోడ్డు నిర్మాణ పనులతో ప్రతిరోజు వాహనాలు నడవడంతో వాటితో వచ్చే దుమ్ముతో అనారోగ్య పాలవుతున్నామన్నారు. రోడ్డునిర్మాణం త్వరగా పూర్తిచేయాలని పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు.

ప్రారంభమైన పంట డిజిటల్ సర్వే

బోథ్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో డిజిటల్ సర్వే ప్రారంభమైంది. గురువారం నుంచి ఆయా గ్రామాలు తమ తమ క్లస్టర్ పరిధిలో పంటలను పొలాలకు వెళ్లి సర్వే నిర్వహిస్తున్నారు. అయితే సుదూర ప్రాంతాల్లో ఉన్న పంట చేనులకు వెళ్లి సర్వే నిర్వహించడం సిబ్బందికి తల ప్రాణం తోకకు వచ్చినట్లు ఉంది. కొన్ని మారుమూల గ్రామాల్లో రైతులు పంటలను కాపాడుకునేందుకు సోలార్ కంచెలతో పాటు విద్యుత్ కంచెలను ఏర్పాటు చేసుకుంటుండటంతో సిబ్బంది మారు మూల గ్రామాలకు వెళ్లేందుకు జంకుతున్నారు.

ప్రమాదకరంగా మూల మలుపులు

గుడిహత్నూర్ , అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులపై మూల మలుపులు ప్రమాదకరంగా మారాయి. మూలమలుపులను గుర్తించే విధంగా సూచికబోర్డులు లేకపోవడంతో ఎక్కడ మూల మలుపులు ఉన్నాయో తెలియక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మండలంలోని ముత్నూర్, దామన్‌గూడ, సోయంగూడ, తెలంగ్ రావ్‌గూడ, కొల్హారీ, సోయంగూడ, సూర్యగూడ, ఉమ్రి గ్రామాలకు వెళ్లే రహదారులపై మూలమలుపులున్నాయి. ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. మూల మలుపుల వద్ద సూచిక బోర్డులు లేకపోవడంతో పాటు రోడ్ల వెంట చెట్లు భారీగా పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక తరచూ ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. దామన్‌గూడ గ్రామానికి వెళ్లే రోడ్డుకు రెండు చోట్ల సూచిక బోర్డులు ఏర్పాటు చేసినా అవి వంగిపోయాయి. సరిగా కన్పించడం లేదు. ఈ గ్రామాల మూలమలుపుల వద్ద గతంలో అనేక ప్రమాదాలు జరిగి ఎందరో గాయాలపాలు కాగా ఒకరు మృతిచెందిన సంఘటన చోటు చేసుకుంది. రాత్రి సమయంలో అంధకారంగా ఉండడంతో ఈ రహదారులపై నుంచి వెళ్లాలంటే ఎలాంటి ప్రమాదాలకు గురికావాల్సి వస్తుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి మూల మలుపులు ఉన్న దగ్గర సూచిక బోర్డులు ఏర్పాటు చేసి, ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



ముత్నూర్ సమీపంలో ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు

దండారీ ఉత్సవాలు ప్రారంభం

సిరికొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఆదివాసీ గిరిజనులు దీపావళి వేడుకల సందర్భంగా సందర్భంగా నిర్వహించే భోగి పూజలతో గుస్సాడీ దండారీ సంబరాలు ప్రారంభమయ్యాయి. గురువారం మండలంలోని కోసుపటేల్‌గూడలో ఆదివాసీలు గుస్సాడీ వేడుకలకు ఉపయోగించే నెమలి ఈకలటోపీలు, వస్త్రాలు, డప్పు, రడమేళ, డోల్, వెట్టి, కర్ర, పిప్రీ, తుడుం తదితర పరికరాలకు గ్రామపటేల్ ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా ప్రత్యేకపూజలు నిర్వహించారు. గుస్సాడీ వేషదారణ చేసే ముందు గ్రామానికి చెందిన ఆదివాసీలు పూజలు చేసి దండారీ ఉత్సవాలను ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామపటేల్ కుమ్రం రావూజీ, దేవరి కుమ్రం జంగుబాపు, మహజన్ కొరెంగ వాగు, కారోబారి కుమ్రం కోసేరావ్, గ్రామస్తులు లింబారావ్, యాదవ్‌రావ్, చందు, జంగు, లక్ష్మణ్, మారుతి, సూర్యభాన్, శశకుమార్, ఆనంద్‌రావ్, రమేష్ పాల్గొన్నారు.



పార్డి (కే) గ్రామంలో పూజలు చేస్తున్న ఆదివాసీలు

ఇంద్రవెల్లి: ఏజెన్సీలోని ఆదివాసీ గిరిజన గూడెల్లో ఆదివాసీ సంస్కృతిని ప్రతిబించేలా గుస్సాడి దండారీ ఉత్సవాలను ఆదివాసీ గిరిజనుల ఆధ్వర్యంలో ఏత్మాసూర్ పేర్ దేవతలకు భోగి ప్రత్యేక పూజలతో గుస్సాడి దండారీ సంబరాలను ప్రారంభించారు. గురువారం మండలంలోనరి గౌరాపూర్ గ్రామంలోని గ్రామ పటేల్ (ఎత్మాసూర్ పేన్ దేవతలు) ఉన్న ఇంటి ఆవరణలో ఆదివాసీ గిరిజన సంప్రదాయ ప్రకారం దండారి ఉత్సవాల్లో గుస్సాడీలు ధరించే నెమలి ఈకలతో తయారు చేసిన టోపీలు, ఖోడాంగ్, ఏత్మాసూర్ పేన్ దేవతలు, డోల్, ప్రిప్రే, సన్నాయి, తుడుం, డప్పులు, పాయిలి, తబలా, వివిధ వస్తువులను ఉంచి వాటికి సంప్రదాయం ప్రకారం ప్రత్యేక పూజలు చేశారు. దేవతలకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గురువారం నుంచి ప్రారంభమైన దండారి ఉత్సవాలు దీపావళి పండుగ అనంతరం కొలబొడితో ముగిస్తాయని ఆదివాసీ గిరిజనులు వివరించారు. కార్యక్రమంలో గ్రామ పటేల్ మడావి మారుతి, మడావి లక్ష్మణ్ పటేల్, దేవరి మడావి భూమేష్, మహాజన్ పూసం బొజ్జు, మడావి సుంగు, కొట్నాక్ హనుమంతు తదితరులు పాల్గొన్నారు. ఆదివాసీ గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో గొప్పవని వాటిని భావి తరాలకు పదిలంగా అందించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షులు పూర్క బాపూరావు అన్నారు. గురు వారం మండలంలోని మల్లాపూర్ తన సొంత గ్రామంలో గుస్సాడి దండారీలో భోగి పూజలకు ఆయన హాజరయ్యారు. కార్యక్రమంలో గ్రామ పటేల్ దుర్వరాజు, మాజీ సర్పంచ్ పూసం ఆనంద్‌రావు, గ్రామ పెద్దలు పూసం కిషన్, మడావి బాపూరావు, కోవా లక్ష్మణ్ ఉన్నారు.



దండారి భోగి పూజలు చేస్తున్న ఆదివాసీలు

ప్రారంభమైన గుస్సాడి పండుగ వేడుకలు

బోథ్ :గుస్సాడి పండుగ వేడుకలు ప్రారంభమయ్యాయి. ఆదివాసి గూడెల ప్రజలు గుస్సాడి ధరించే టోపీ కొండాల పెన్ పెట్టే పర్ర దేవుళ్ళకు పూజలు చేశారు. కార్యక్ర మంలో గ్రామ పటేల్ అమృతరావు, ఐటీడీఏ డైరెక్టర్ మెశ్రమ భూమన్న, దేవారి జూతూ పురుషోత్తం, రాజు, ప్రవీణ్, రమేష్, దశరథ్, సురేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రైతు పోరుబాట సక్సెస్

(5వ పేజీ తరువాయి)

రుణమాఫీ, రైతుభరోసా పూర్తిస్థాయిలో అమలు చేయాలని లేదంటే ప్రజల పక్షాన బీఆర్ఎస్ పార్టీ నిలబడి పోరాటం చేస్తుందన్నారు.

కేటీఆర్ సభకు సక్కు దుమ్మా

గడిచిన పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరపున ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలైన ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు. కేటీఆర్ సభకు దుమ్మా కొట్టడంపై పార్టీలో చర్చనీయాంశంగా మారింది. గత కొంత కాలంగా సక్కు. కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశం ఉందన్న వార్తలు రావడంతో ఆయన తీరుపై పార్టీలో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా రైతుపోరుబాట సభకు ఆయన దూరం గా ఉండడంపై పార్టీ వర్గాల్లో బిన్నాభిప్రాయాలు వినిపిస్తున్నాయి. పార్టీ అధికారానికి దూరమైన తర్వాత తొలిసారి నిర్వహించిన పోరుబాట సభకు పార్లమెంట్ పరిధిలోని ముఖ్యనేత ఆత్రం సక్కు హాజరుకాక పోవడంతో బీఆర్ఎస్‌లో ఆసక్తిగా మారింది.

జిల్లా గ్రంథాలయం పరిశీలన

ఆదిలాబాద్ రూరల్, అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్ గురువారం పరిశీలించారు. నిరుద్యోగ అభ్యర్థులను, పాఠకులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని నూతన మండలాల్లో గ్రంథాలయాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. గ్రంథాలయ ప్రాంగణంలోని భవన నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు. నిరుద్యోగ అభ్యర్థులందరికీ కాంపిటేటివ్ బుక్స్ అందుబాటులో ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో అభ్యర్థులు, పాఠకులు పాల్గొన్నారు.

బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న డీఐవో

తలమడుగు , అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవీందర్ అన్నారు. గురువారం తలమడుగు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన బతుకమ్మ సంబరాలు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కనుమరుగవుతున్న సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ భావితరాలకు అందించాలన్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో 2కే రన్

ఇంద్రవెల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పోలీసుల అమర వీరుల సంస్మరణ దినోత్సవాల్లో భాగంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో గురువారం మండలం కేంద్రంలో 2కే రన్ నిర్వ హించారు. పోలీస్‌స్టేషన్ వద్ద ఎస్సై దుబ్బాక సునీల్ ప్రారంభించారు. వివిధ పాఠశాల విద్యార్థులతో పోలీస్‌స్టేషన్ నుంచి అంజి చౌరస్తా వరకు ఇది కొనసాగింది.

విద్యార్థులకు ఓపెన్‌హౌస్ ప్రదర్శన

ఇచ్చోడ, అక్టోబరు, 23 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఇచ్చోడ పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో ఓపెన్‌హౌస్‌ను గురువారం నిర్వహించారు. పోలీసులు ఉపయోగించే ఆయుధాలు, వాటి ప్రాధాన్యం, పనితీరు గురించి కార్యక్రమానికి హాజరైన విద్యార్థులకు వివరించారు.

బోథ్‌లో రక్తదాన శిబిరం

బోథ్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో గురువారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి భారీ స్పందన లభించింది. శిబిరానికి 84 మంది దాతలు వచ్చి రక్తదానం చేశారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల

పరిశీలన ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలి

నిర్మల్ అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సంబంధిత ప్రతి అధికారి తప్పకుండా క్షేత్రస్థాయిలో వెళ్లి దరఖాస్తులను పరిశీలించాలన్నారు. రోజువారీగా పరిశీలించిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల వివరాలను అధికారులకు అందజేయాలన్నారు. పీఎం విశ్వకర్మ పథకానికి వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిశీలించి, ఆపై దశకు పంపాలని తెలిపారు. వీలైనంత ఎక్కువ మంది అర్హులై ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే విధంగా ప్రోత్సహించాలన్నారు. మొక్కల పెంపకానికి నర్సరీలను సిద్ధపరచుకోవాలని అధికారులను ఆదేశించారు. మొక్కల పెంపకానికి స్థానికంగా ఏ మొక్కలకు ఎక్కువ డిమాండ్ ఉందో వాటి విత్తనాలను సేకరించుకోవాలన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జడ్పీ సీఈవో గోవింద్, డీపీవో శ్రీనివాస్, డీఆర్డీవో విజయలక్ష్మి, ఎల్డీఎం రాంగోపాల్, అన్ని మండలాల ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రూ. 3 లక్షల కలప పట్టివేత

సారంగాపూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గల పొట్యా గ్రామ పంచాయతీలో గురువారం అటవీశాఖ అధికారులు ఎండీ నజీర్ ఖాన్ ఆధ్వర్యంలో ఎఫ్‌బీవోలు సుజాత, వెన్నెల స్వప్నలు సోదాలు నిర్వహించగా, రూ. 3 లక్షల విలువ గల టేకు కలప దుంగలను పట్టుకొని కలప కోత యంత్రాన్ని స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. అక్రమంగా కలప దుంగలను నిల్వ ఉంచిన యజమానిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఖానాపూర్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు



మాట్లాడుతున్న ఫుడ్ సేఫ్టీ అధికారి

ఖానాపూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్‌లో గురువారం ఫుడ్ సేఫ్టీ అధి కారులు ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఒక రెస్టారెంట్‌లో ఫుడ్‌సేఫ్టీ అధికారులు తనిఖీ నిర్వహిస్తున్నట్లు ప్రచారం జరగడంతో పట్టణంలోని మిగతా హోటళ్లు, బేకరీలు, కిరాణా దుకాణాలను సదరు వ్యాపారులు వెంటనే మూసి వేశారు. దీంతో ఆయా హోటళ్లలో, బేకరీలలో, కిరాణా దుకాణాలలో నాణ్యమైన తినుబండారాలను విక్రయించకపోవడం తోనే వాటిని అధికారులు తనిఖీ చేయకుండా మూసి వేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సదరు రెస్టారెంట్ నుంచి శాంపిల్స్‌ను స్వీకరించిన ఫుడ్ సేఫ్టీ అధికారి ప్రత్యూష మీడియాతో మాట్లాడారు. రెస్టారెంట్లకు లైసెన్స్ వెంటనే తీసుకోవాలని వారం రోజుల్లోపు లైసెన్స్ తీసుకోని రెస్టారెంట్లకు రూ.5 లక్షల వరకు జరిమానా విధిస్తామన్నారు. తినుబండారాల్లో మోతా దుకు మించి కలర్ కలిపితే చర్యలు చేపడతామన్నారు. నిబంధనలు పాటించని వారిపట్ల కఠిన చర్యలు తప్పవన్నారు. ఖానాపూర్‌లో ఒకచోట తనిఖీ నిర్వహిస్తుండగా మిగ తా హోటళ్లు, దుకాణాలు మూసి వేయడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు ఆమె తెలిపారు. త్వరలోనే ఖానాపూర్‌లో ఆకస్మిక తనిఖీ నిర్వహించి ఏకకాలంలో అన్నింటినీ పరిశీలిస్తామన్నారు.

ప్రతి ఒక్కరికీ 100 రోజుల పని కల్పించాలి

లక్ష్మణచాంద, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : జాబ్ కార్డ్ ఉండి అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి 100 రోజుల పని కల్పించాలని ఎంపీడీవో రాధా రాథోడ్ అన్నారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో గురువారం గ్రామసభ నిర్వహించారు. 2025-26 సంవత్సరానికి గాను ఉపాధి హామీ పనుల ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని ఆమె సూచించారు. ఆసక్తి ఉన్న రైతులకు పండ్ల మొక్కలను పంపిణీ చేసి వారి వార్షిక ఆదాయాన్ని పెంచాలని సలహా ఇచ్చారు.

గుజరాత్ తరహాలో తెలంగాణలో పత్తికి మద్దతు ధర ఇవ్వాలి

- ప్రధాని మోదీకి తెలంగాణ రైతులు కనిపించడం లేదా ?
- బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలు ఏం చేస్తున్నారు ?
- రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నిర్మల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : గుజరాత్ రాష్ట్రంలో క్వింటాల్ పత్తికి రూ. 8,800ల ధర చెల్లిస్తుంటే... తెలంగాణ రైతులకు 7 వేల పైచిలుకు మద్దతు ధర మాత్రమే ఇస్తున్నారని, ఇది న్యాయమేనా అని భారత రాష్ట్ర సమితి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. తారక రామారావు ప్రశ్నించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా గురువారం సాయంత్రం నిర్మల్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ అన్ని రాష్ట్రాలను ఒకే మాదిరిగా చూడడం లేదని, తన సొంత రాష్ట్రం గుజరాత్‌పై ఉన్న ప్రేమ తెలంగాణపై ఎందుకు చూపడం లేదని ప్రశ్నించారు. ఆదిలాబాద్ ఎంపీ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ముగ్గురు బీజేపీ ఎమ్మెల్యేలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. గుజరాత్ తరహా మద్దతు ధర సాధించకపోతే ఆ తప్పంతా బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలదేనని ఆయన వ్యాఖ్యానించారు. వరికి మద్దతు ధరతో పాటు బోనస్ ఇచ్చే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తున్నదని ఆరోపించారు. రైతుల పక్షాన ప్రధాన ప్రతిపక్షంగా తాము పోరాటం చేస్తామని ప్రకటించారు. దిలావర్‌పూర్ మండలంలో నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని వెంటనే నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. తమ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఈ ఫ్యాక్టరీ నిర్మాణానికి జనావాసాలకు రైతు వ్యవసాయ క్షేత్రాలకు దూరంగా స్థలం చూపిస్తు, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంఓలకి వచ్చిన తర్వాత రైతులకు అన్యాయం జరిగేలా ఫ్యాక్టరీ నిర్మాణానికి అనుమతులు ఇచ్చిందని ఆరోపించారు. ఆ నిర్మాణాన్ని అడ్డుకునేందుకు తమ పార్టీ పోరాటం చేస్తుందన్నారు. పది సంవత్సరాల పాటు అధికారం అనుభవించి తమ పార్టీని కొంతమంది సీనియర్లు వదిలిపెట్టి వెళ్లినా... తమ పార్టీకి ఎలాంటి ఢోకా లేని మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, అనిల్ జాదవ్, స్థానిక నాయకులు రామ్‌కిషన్‌రెడ్డి, జాన్సన్ నాయక్, రమాదేవి, లోలం శ్యాంసుందర్, సుభాష్ రావు, తదితరులు పాల్గొన్నారు.



నిర్మల్‌లో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి కేటీఆర్

లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

అందజేసిన నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు

నిర్మల్ అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు వరం లాంటిదని డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు అన్నారు. జిల్లాకేంద్రం భాగ్యనగర్‌లోని డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు క్యాంపు కార్యాలయంలో నిర్మల్ పట్టణం, సారంగాపూర్, లక్ష్మణచాంద, సోన్, మామడ, మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు శనివారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరి రావు, నిర్మల్ ఏఎంసీ చైర్మన్ సోమ భీమ్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు నాందేడపు చిన్ను, లక్ష్మణచాంద జడ్పీటీసీ ఓస రాజేశ్వర్, మామడ మండల జడ్పీటీసీ రాథోడ్ సంతోష్‌సోనియా, మాజీ ఏఎంసీ డైరెక్టర్ లింగారెడ్డి, సోన్ మండల అధ్యక్షులు మధుకర్‌రెడ్డి, దేవరకోట చైర్మన్ కొండా శ్రీనివాస్, వివిధ మండలాల నాయకులతో కలిసి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సదర్భంగా శ్రీహరిరావు మాట్లాడుతూ... వివిధ అనారోగ్య సమస్యలతో చికిత్స పొంది, ఆర్థిక భారం భరించలేక ముఖ్యమంత్రి సహాయనిధి కొరకు దరఖాస్తు చేసుకున్న వారందరికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆశీస్సులతో దాదాపు 15 మంది ల్ధిదారులకు ఐదు లక్షల 70 వేల రూపాయలు అందించటం జరిగిందన్నారు. సరైన ఆరోగ్య అవసరాల కోసం సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంజూరు చేసిన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి నా తరపున, లబ్ధిదారుల తరపున ప్రత్యేక హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు. నిరు పేదలకు సహాయం అందిస్తూ ప్రజా ఆశీస్సులతో రానున్న రోజుల్లో ఇంకా గొప్పగా పది కాలాల పాటు పరిపాలన సాగించాలని, ఆయురారోగ్యాలు అందించాలని భగవంతుడిని వేడుకున్నారు.

గల్ఫ్ మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా విడుదల

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : గల్ఫ్ మృతుల కుటుంబాలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.6 కోట్ల 45 లక్షల ఎక్స్‌గ్రేషియా విడుదల చేసినట్టు గల్ఫ్ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. స్వదేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నిధులు విడుదల అయినట్టు ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ వాట్సాప్ ద్వారా సమాచారం అందించినట్టు తెలిపారు. ఇందులో భాగంగా నిర్మల్ జిల్లాకు రూ. 50 లక్షల రూపాయిలు మంజూరయ్యాయన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, టీపీసీసీ గల్ఫ్ అధ్యక్షుడు సింగిరెడ్డి నరేష్‌రెడ్డి, తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగులకు గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్ పరీక్షలు

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీలో పనిచేస్తున్న ఉద్యోగులతో పాటు వారి జీవిత భాగస్వాములకు గ్రాండ్‌హెల్త్ పరీక్షలను గురువారం డీఎం ప్రతిమారెడ్డి ప్రారంభించారు. కాల్ హెల్త్ టీమ్ సహకారంతో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు డీఎం తెలిపారు. ఎండీ సజ్జనార్ ఆదేశానుసారంగా ఈ నెల 24 నుండి 29 వరకు పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. పరీక్షలు చేసి వైద్యులు తగు సూచనలు ఇస్తారని, ఉద్యోగులు ఈ అవకాశం వినియోగించుకోవాలని కోరారు.

'రోడ్డుపై పంటలను ఆరబెట్టొద్దు'

కుంటాల, అక్టోబర్, 24 : (ఆంధ్రజ్యోతి) : రహదారులపై పంటలను ఆరబెడితే రోడ్డు ఇరుకుగా మారి ప్రమాదాలు జరుగుతున్నాయని కావున రోడ్లపై ఆరబెట్టకూడదని గురువారం కుంటాల ఎస్సై భాస్కరాచారి సూచించారు.

లైబ్రరీ ప్రారంభం

మండలంలోని లింబా (కే) ప్రభుత్వ పాఠశాలలో గురువారం మోడల్ లైబ్రరీని ఎంఈవో ముత్యం ప్రారంభించారు ఈ కార్యక్రమంలో హెచ్ఎం రవీందర్, ఏంఎన్ఓ రాజేశ్వర్, ఏపీపీసీ చైర్మన్ అనిత, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సీపీఎస్ అంతానికి ఓటే ఆయుధం

ఉద్యోగ ఉపాధ్యాయుల భవిష్యత్తును అంధకారం చేస్తున్న కంట్రిబ్యూటరీ విధానం అంతం చేయడానికి ఓటును ఆయుధంగా మలుచుకోవాలని కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ నిర్మల్ జిల్లా అధ్యక్షులు కృష్ణారావు అన్నారు. గురువారం స్థానిక ఆదర్శ మాడల్ పాఠశాలలో మాట్లాడారు.

ఘనంగా ఐక్యరాజ్య సమితి దినోత్సవం

మండల కేంద్రం కుంటాల స్థానిక శాంతినికేతన్ పాఠశాలలో గురువారం ఐక్యరాజ్య సమితి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

ఓకేషనల్ కాంట్రాక్టు

లెక్చరర్లను క్రమబద్ధీకరించాలి


- అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కార్గాం వినోద్‌కుమార్



భైంసా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఉద్యోగులు

భైంసా, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఓకేషనల్ కాంట్రాక్టు అధ్యాపకుల పోస్టులను సాంక్షన్ పోస్టులుగా గుర్తించి క్రమబద్ధీకరించాలని తెలంగాణ గజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కార్గాం వినోద్‌కుమార్ రేవంత్‌రెడ్డి సర్కార్‌కు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కాంట్రాక్టు పద్ధతిన విధులు నిర్వహిస్తున్న 23 మంది అధ్యాపకుల పోస్టులను క్రమబద్ధీకరించిన సందర్భాన్ని పురస్కరించుకొని గురువారం భైంసా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో టీజీఎల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి నిర్వహించిన క్షీరాభిషేకం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఇందులో భైంసా ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

జువెల్లరీ షాపులో చోరీ



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కుభీర్, అక్టోబరు 24 : మండల కేంద్రంలోని బజార్‌రోడ్డులో గల ఆకాష్ జువెల్లరీస్‌లో గురువారం వేకువ జామున దొంగతనం జరిగింది. షాపు తాళాలను పగలగొట్టి షెటర్‌లను ధ్వంసం చేసి లోనికి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. షాపు యజమానికి బచ్చు రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. షాపులో ఉన్న 13కేజీల వెండి గొలుసులు, ఆభరణాలు, 30గ్రాముల బంగారం, రూ. 45వేలు నగదును దొంగలించినట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. షాపులోపలికి ప్రవేశించక ముందు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. సమాచారం అందుకున్న భైంసా సీఐ నైలు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. అనంతరం డాగ్‌స్క్వాడ్ , క్లూజ్ టీం సిబ్బంది వివరాలను వేలిముద్రలను సేకరించారు. బజార్‌రోడ్‌లో గల పలు దుకాణాల సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించారు. ముఖాలకు గుడ్డలు కట్టుకొని చేతులకు గ్లౌస్‌లు వేసుకొని ముగ్గురు వ్యక్తులు చోరీ చేసి ద్విచక్ర వాహనంపై వెళ్లినట్లు పోలీసులు నిర్ధారించారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

'ఆంధ్రజ్యోతి' పరిశీలన



తాత్కాలిక భవనంలో నిర్వహిస్తున్న ఖానాపూర్ గ్రంథాలయం (ఫైల్)

నిరుపేదలకు వరం.. ఆ విజ్ఞాన భండాగారాలు..

- పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి అందుబాటులో స్టడీ మెటీరియల్స్
- అడిగిన పుస్తకాన్ని 24 గంటల్లో అందుబాటులో ఉంచుతున్న లైబ్రేరియన్స్
- నిర్మల్ గ్రంథాలయ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయనున్న అర్జుమన్ అలీ
- కొత్త చైర్మన్‌పై కోటి ఆశలు

నిర్మల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : నేటి పోటీ ప్రపంచంలో ప్రభుత్వ ఉద్యోగం సాధించడం అనేది ఎంతో కష్టతరమైన పనిగా భావిస్తూ పలువురు ప్రైవేట్ రంగం వైపు పరుగులు తీస్తున్నారు. మరికొంత మంది ప్రభుత్వ ఉద్యోగ సాధనే లక్ష్యంగా ప్రైవేట్ కోచింగ్ సెంటర్లలో చదువుతూ ఏడాదికి లక్షల రూపాయలను ఖర్చు చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో లక్షల రూపాయలను వెచ్చించి కోచింగ్ సెంటర్లను ఆశ్రయించే ఆర్థిక స్తోమత లేక ఎంతో మంది నిర్మల్ జిల్లా విద్యార్థులు ఆవేదన చెందారు. అందరిలా తాము కోచింగ్ సెంటర్లలో చదువుకొని పోటీ పరీక్షలకు సన్నద్ధం అవ్వాలనే వారి ఆశకు జిల్లాలోని గ్రంథాలయాలు ప్రాణం పోశాయి. ఈ ప్రాంతంలోని నిరుపేద విద్యార్థులకు వరంగా మారిన ఈ గ్రంథాలయాల్లో నిత్యం వేలాది మంది విద్యార్థులు ఆయా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. పోటీ పరీక్షలకు సిద్ధం అవ్వడమే కాకుండా తాజాగా వెలువడిన ఆయా ప్రభుత్వ ఉద్యోగాల ఫలితాల్లో పలువురు ఉద్యోగాలు సాధించి ఔరా అనిపించారు. నిరుపేద విద్యార్థులకు ఇంతటి సౌకర్యంగా మారిన ఈ గ్రంథాలయాల పట్ల గత ప్రభుత్వం కాస్త నిర్లక్ష్యంగా వ్యవహరించిందనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంపై నిర్మల్ జిల్లా ప్రాంత నిరుపేద విద్యార్థులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఈ క్రమంలో తాజాగా నిర్మల్ గ్రంథాలయ చైర్మన్‌గా సయ్యద్ అర్జుమన్ అలీని నియమిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నిర్మల్ గ్రంథాలయ చైర్మన్‌గా నేడు సయ్యద్ అర్జుమన్ అలీ ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో ఆయనపై పాఠకులు కోటి ఆశలు పెట్టుకున్నారు.

జిల్లా వ్యాప్తంగా 55 మంది ప్రభుత్వ ఉద్యోగానికి ఎంపిక..

నిర్మల్ జిల్లాలో 16 గ్రంథాలయాలు ఉండగా నిత్యం వెయ్యి మందికి పైగా నిరుపేద విద్యార్థులు ఈ గ్రంథాలయాలలో చదువుతూ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. కాగా ఇటీవల విడుదలైన ఆయా ప్రభుత్వ ఉద్యోగ ఫలితాలలో జిల్లా వ్యాప్తంగా మొత్తం 55 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చాయి. లక్షలు వెచ్చించి ప్రైవేట్ కోచింగ్ సెంటర్లను ఆశ్రయించలేక గ్రంథాలయాలను ఉపయోగించుకొని ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను పలువురు అభినందిస్తున్నారు. ఒక్క ఖానాపూర్ గ్రంథాలయ పరిధిలోనే ఏడుగురు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. స్థానికంగా ఇంచార్జి లైబ్రేరియన్‌గా విధులు నిర్వహిస్తున్న పృథ్వీ ప్రత్యేక చొరవతో పాఠకులు అడిగిన స్టడీ మెటీరియల్స్‌ను 24 గంటల్లో అందుబాటులో ఉంచడంతోనే ఈ అద్భుత ఫలితాలు సాధించడం సాధ్యపడిందని పాఠకులు అభిప్రాయపడుతున్నారు. ఖానాపూర్ లైబ్రరీలో 50 మంది నిత్యం సిద్ధమైతే ఇందులో అడుగురు ఎస్జీటీ, ఇద్దరికి స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగాలు వచ్చాయి. జిల్లాలో మొత్తం 55 మంది ఉద్యోగాలు సాధించడంతో పాటు పలువురు గ్రూప్‌కి ప్రిపేర్ అయ్యారు. గ్రూప్స్‌కి ప్రిపేర్ అయిన వాళ్లలో పలువురు ప్రిలిమ్స్‌లో ఇటీవల మె యిన్స్ పరీక్షలు సైతం రాసినట్టు చె బుతున్నారు.

అద్భుత ఫలితాలు సాధిస్తున్నా.. వెక్కిరిస్తున్న అరకొర సౌకర్యాలు


జిల్లా వ్యాప్తంగా ఉన్న 16 గ్రంథాలయాలలో చదివి 55 మంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం అనేది ఓ అద్భుతమైన ఫలితంగా పలువురు అభివర్ణిస్తున్నారు. జిల్లాలోని ఈ జ్ఞాన భండాగారాలను ఉపయోగించుకొని అద్భుత ఫలితాలు సాధిస్తున్న ప్పటికీ వీటిలో ఉన్న అరకొర వసతులు మాత్రం పాఠకులను వెక్కిరిస్తూనే ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 16 గ్రంథాలయాలు ఉండగా అందులో డిస్ట్రిక్ట్ సెంట్రల్ లైబ్రరీతో పాటు లక్ష్మణచాంద, మామడ, దిలావర్‌పూర్, నర్సాపూర్ (జి), లోకేశ్వరం, కుంటాల, భైంసా, కుభీర్, ముథోల్ 9 గ్రంథాలయాలకు మాత్రమే సొంత భవనాలున్నాయి. కాగా తానూర్‌లో ఉన్న గ్రంథాలయం అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. ఖానాపూర్, కడెం, పెంబి, సారంగాపూర్, బాసర ఈ ఐదు గ్రంథాలయాలు తాత్కాలిక భవనాల్లో (రెంట్ ఫ్రీ) నిర్వహిస్తున్నారు. కాగా అద్దె భవనంతో పాటు తాత్కాలిక భవనాల్లో నిర్వ హిస్తున్న గ్రంథాలయాల్లో మౌలిక వసతులు లేక నిత్యం గ్రంథాలయాలకు వచ్చే పాఠకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెబుతున్నారు. కొన్ని చోట్ల కనీస సౌకర్యాలైన మంచినీటి సౌకర్యం, మల మూత్రశాలలు సైతం అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదని పాఠకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆశించిన స్టడీ మెటీరియల్స్‌ను అందుబాటులో ఉంచుతున్నప్పటికీ మౌలిక సదుపాయాలు సైతం కల్పిస్తే తమకు మరింత సౌకర్యంగా ఉండి ప్రైవేట్ కోచింగ్ సెంటర్లను ఆశ్ర యించే వారు సైతం గ్రంథాలయాలలో పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతారని చెబుతున్నారు.


ఖానాపూర్ గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

కొత్త చైర్మన్‌పై కోటి ఆశలు..

గత ప్రభుత్వ హయాంలో గ్రంథాలయాల నిర్వహణ పట్ల నిర్లక్ష్యం చూపారని ఆరోపణల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంపై నిర్మల్ జిల్లా పాఠకులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఈ ఆశలకు అనుగుణంగానే ఇటీవల నిర్మల్ జిల్లా గ్రంథాలయ శాఖ చైర్మన్‌ను నియమిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నిర్మల్‌కు చెందిన సయ్యద్ అర్జుమన్ అలీని నిర్మల్ గ్రంథాలయ చైర్మన్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో నిన్న మొన్నటి వరకు ఈ పదవిని చేపట్టేదుకు ఆయన కాస్త సుముఖంగా లేరనే ప్రచారం జరిగినప్పటికీ ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన సయ్యద్ అర్జుమన్ అలీ తాజాగా ప్రమాణ స్వీకారం చేసేందుకు సిద్ధమయ్యారు. నేడు నిర్మల్ గ్రంథాలయ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసేందుకు సయ్యద్ అర్జుమన్ అలీ ముహూర్తం ఖరారు అయిన నేపథ్యంలో కొత్త చైర్మన్‌పై నిర్మల్ జిల్లా పాఠకులు కోటి ఆశలు పెట్టుకున్నారు. నిర్మల్ జిల్లాలోని 16 గ్రంథాలయాల్లో ఉన్న సమస్యలన్నింటిని చైర్మన్ సయ్యద్ అర్జుమన్ అలీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు. 16 గ్రంథాలయాలకు ప్రస్తుతం కేవలం 11 మంది మాత్రమే లైబ్రేరియన్స్ ఉండడంతో మిగతా ఐదు చోట్ల డిప్యూటేషన్‌పై ఇంచార్జి లైబ్రేరియన్స్‌గా పలువురు విధులు నిర్వహిస్తుండడం పాఠకులకు కాస్త ఇబ్బందికరంగా మారిందని చెబుతున్నారు. మరింత మంది లైబ్రేరియన్స్‌తో పాటు ఆయా గ్రంథాలయాల్లో అవసరం ఉన్న స్టడీ మెటీరియల్స్‌ను అందుబాటులో ఉంచేలా నూతన చైర్మన్ చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.


ఖానాపూర్‌లో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన వారిని సన్మానిస్తున్న తోటి పాఠకులు (ఫైల్)


ఖానాపూర్ గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమై ఇటీవల ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన ఖానాపూర్ ప్రాంత వాసులు

మౌలిక సదుపాయాలు కల్పిస్తే మరింత ఉపయోగకరంగా ఉంటుంది..



● లాండరీ శశిధర్, ఖానాపూర్ గ్రంథాలయ పాఠకుడు

ఖానాపూర్ గ్రంథాలయంలో నిత్యం 50 మందికి పైగా పాఠకులు పుస్తక పఠనం చేస్తారు. ఖానాపూర్‌లో చదివిన పలువురు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. నేను సైతం గ్రూప్స్ కోసం ప్రిపేర్ అవుతున్నాను. ప్రస్తుతం ప్రిలిమ్స్ క్వాలిఫై అయ్యాను. ఖానాపూర్ శాఖ గ్రంథాలయంలో మౌలిక సౌకర్యాలు లేక పాఠకులు ఇబ్బంది పడుతున్నారు. కనీసం బాత్రూమ్స్ సౌకర్యం కూడా లేదు. ప్రభుత్వం స్పందించి మౌలిక వసతులు కల్పిస్తే మరింత సౌకర్యంగా ఉంటుంది.

లైబ్రేరియన్ సహకారంతోనే ప్రభుత్వ ఉద్యోగం సాధించాను..



● మొలుగూరి నవీన్ కుమార్, స్కూల్ అసిస్టెంట్, గ్రంథాలయ పూర్వ పాఠకుడు

లక్షలు వెచ్చించి ప్రైవేట్ కోచింగ్ సెంటర్లను ఆశ్రయించే పరిస్థితి లేక ఖానాపూర్ గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యాను. స్థానికంగా ఇంచార్జి లైబ్రేరియన్ పృథ్వీ అడిగిన పుస్తకాలను 24 గంటల్లోపు అందుబాటులో ఉంచేవారు. ఆయన సహకారంతో స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించాను. నేను ప్రభుత్వ ఉద్యోగం సాధించేందుకు ఉపయోగపడిన ఖానా పూర్ గ్రంథాలయానికి నా వంతుగా సహాయ సహకారాలను నిరంతరం అందజేస్తా.

జర దేఖో


న్యూ లోలం సమీపంలో తారు లేచిపోయి మొరం తేలిన బీరవెల్లి రోడ్డు

ఆ రోడ్డుపై ప్రయాణం.. తప్పించుకోని ప్రమాదం

● అధ్వానంగా న్యూలోలం - బీరవెల్లి రోడ్డు ● పట్టించుకోని అధికారులు

దిలావర్‌పూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రెండు మండలాలను కలుపుతూ వేసిన న్యూలోలం- బీరవెల్లి రోడ్డు నిర్లక్ష్యానికి గురవుతోంది. ఫలితంగా ఈ రోడ్డుపై ప్రయాణం రెండు మండలాల ప్రజలకు ప్రాణ సంకటంగా మారింది. దిలావర్‌పూర్- సారంగాపూర్ మండలాలను కలుపుతూ 30 సంవత్సరాల క్రితం మొరంతో వేసిన రోడ్డు వేశారు. ఈ రోడ్డు రెండు మండలాల ప్రజలకు సౌకర్యవంతంగా ఉండటంతో రాకపోకలు అధికమయ్యాయి. రోడ్డుపై రద్దీని దృష్టిలో పెట్టుకుని 15 ఏళ్ల క్రితం తారు రోడ్డు గా మార్చారు. ఇక అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ రోడ్డును పట్టించుకునే వారే కరువయ్యారు.

ప్రయాణం ప్రాణ సంకటం...

దిలావర్‌పూర్ మండలంలో న్యూ లోలం నుంచి సారంగాపూర్ మండలం బీరవెల్లి వరకు ఐదు కిలో మీటర్ల రోడ్డు వేశారు. ప్రతినిత్యం రెండు మండలాల ప్రజలు ప్రయాణిస్తుంటారు. దట్టమైన అడవుల నుంచి ఉన్న ఈ రోడ్డు అధ్వాన్నంగా మారింది. అడుగడుగునా గుంతలతో ప్రయాణికుల సహనాన్ని పరీక్షిస్తోంది. వేసిన తారు పూర్తిగా లేచిపోయింది. రోడ్డుపై ఉన్న గుంతల్లో వాహనాలు అదుపు తప్పి పడిపోవడంతో చాలా మందికి గాయాలైన సంఘటనలు చాలా ఉన్నాయి. రాత్రి వేళల్లో ఈ రోడ్డుపై వెళ్లాలంటే అరచేతిలో ప్రాణాలను పెట్టుకోవాల్సిందే. చుట్టూ దట్టమైన అడవితో పాటు రోడ్డుపై గుంతలు వాహన చోదకులకు చెమటలు పట్టిస్తాయి. ఒకవేళ అడవిలో గుంతల వల్ల వాహనం చెడిపోతే పరిస్థితి దారుణంగా ఉంటుంది.

ప్రతీ ఆదివారం ప్రయాణికుల రద్దీ ఎక్కువ..

ప్రతి ఆదివారం సారంగాపూర్ మండలంలోని అడెల్లి మహా పోచమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకునేందుకు వెళ్లే భక్తులతో రద్దీ ఎక్కువగా ఉంటుంది. దిలావర్‌పూర్ మండల ప్రజలతో పాటు లోకేశ్వరం, ముథోల్, భైంసా, మహారాష్ట్ర నుంచి భారీగా భక్తులు అమ్మవారి దర్శనం కోసం వెళ్తుంటారు. ప్రధానంగా ఈ రోడ్డు ద్వారానే వెళ్లాలి. రోడ్డు బాగా లేకపోవడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఆదమరిచి వాహనం నడిపితే అదుపు తప్పి రోడ్డు దిగిపోవడం ఖాయం.. ప్రమాదాలు జరిగి ఆసుపత్రి లో పడటం సహజంగా మారింది. అసలే అమ్మవారికి మొక్కులు చెల్లించే వారు, బంధువుల మద్యం తాగి మత్తులో ఉంటారు. డ్రైవర్ తాగి ఉంటే ఇక అంతే సంగతులు.. అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేయించాలని రెండు మండలాల ప్రజలు కోరుతున్నారు.


బీరవెల్లి అడవుల మధ్య గుంతలు పడ్డ రోడ్డు

'ఆంధ్రజ్యోతి' ఫోకస్


మురుగుకాల్వలు లేక సీసీ రహదారులపై పారుతున్న మురుగునీరు


రహదారిపై పారుతున్న మురుగునీరు, కుళ్లిపోయిన చెత్తచెదారం

ఇచ్చోడ పట్టణంలో మౌలిక వసతులు కరువు

● కనిపించని మురుగు కాల్వలు
● ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ఇచ్చోడ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇచ్చోడ పట్టణంలోని పలు కాలనీల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. అంతర్గత దారులు అధ్వానంగా మారగా.. మురుగు కాల్వలు సక్రమంగా లేవు. దీంతో రాకపోకలకు కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. పలు కాలనీలోని అంతర్గత దారులపై మురుగు కాల్వలు నిర్మించకపోవడంతో స్థాని కులు పడుతున్న అవస్థలు ఎక్కువయ్యాయి. కాలనీలోని ప్రధాన దారులతో పాటు అంతర్గత రోడ్లు, సీసీ దారులు ఉన్న మురుగు కాలువలు లేక రోడ్లపై మురుగు తండవం చేస్తుంది. దీనికి తోడు కాల్వల నిర్మాణం చేపట్టక పోవడంతో ప్రజలు వదిలే నీరంతా దారులపైనే పారు తుంది. గుంతల్లో మురుగు చేరడంతో ఈగలు, దోమలకు ఆవాసంగా మారుతుంది. పరిసరాల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై ఇచ్చోడ మేజర్ గ్రామ పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదని, ఇప్పటికైనా అధికారులు తగు చర్యలు తీసుకొని ప్రజల ఇబ్బందులు తీర్చాలని స్థాని కులు కొరుతున్నారు.

బొబ్బిలి వేటలో బోథ్ అటవీ శాఖ అధికారులు

● రంగంలోకి దిగిన జన్నారం టీమ్

బోథ్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : బోథ్ రేంజ్ పరిధిలోని అడవులలో పెద్దపులి బెబ్బులి గత రెండు రోజుల నుంచి అలజడి సృష్టిస్తుంది. బుధవారం సాయంత్రం పూట పులి పంట చేనులో ఉన్న ఎద్దుపై దూకి చంపివేయడంతో పులి ద్వారా ఏ ముప్పు ఎప్పుడు వాటిల్లుతుందోనని మారుమూల గిరిజన గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తపరుస్తున్నారు. అయితే పులిని ఎలాగైనా ఇక్కడి నుంచి పంపించాలన్న ఉద్దేశంతో పాటు దానిని రక్షించాలిన అటవీ శాఖ సిబ్బంది చర్యలు చేపట్టారు.

● సీసీ కెమెరాల ఏర్పాటు...

పులి జాడ తెలుసుకునేందుకు..

పులి జాడ తెలుసుకుని దానిని రక్షించేందుకు కూడా అటవీ శాఖ అధికారులు రంగంలోకి దిగారు. అడవుల్లో అనిమల్ ట్రాక్ కెమెరాలను ఏర్పాటు చేయడంతో పులి జాడ దాని కదలికలు తెలిసే ఆస్కారం ఉందని అటవీ శాఖ వర్గాల వారు అంటున్నారు. మరో వైపు పులిని సురక్షిత ప్రాంతానికి తరలించడం లేదా దానిని కాపాడటం కోసం అధికారులు నిర్ణయిస్తున్నారు. ముఖ్యంగా వ్యవసాయదారులు పంటలను కాపాడుకునేందుకు విద్యుత్ కంచె ఏర్పాటు చేస్తే పులికి ఇబ్బందులు తలెత్తుతాయోనని అధికారులు రైతులను గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

● రంగంలోకి ప్రత్యేక టీమ్

పులిని సురక్షితంగా ఉంచాలన్న ఉద్దేశంతో అటవీ శాఖ అధికారులు జన్నారం అటవీ ప్రాం తంలో విధులు నిర్వహించే ప్రత్యేక టీమ్ బృందాన్ని బోథ్ రేంజికి పంపించడం జరిగింది. దీంతో బృందం వారు అడవుల్లోకి చేరుకుని పులి జాడలను కనుక్కునే ప్రయత్నం చేస్తున్నారు. అంతేగాక పులిని రక్షించేందుకు గాను ప్రత్యేక టీమ్ ముందస్తు చర్యలు చేపట్టింది. అటవీ శాఖ అధజకారులు సైతం గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఒంటరి అడవుల్లోకి వెళ్లవద్దని అంతేగాక పశువులను, మేకల మందలను తీసుకువెళ్లవద్దని సూచిస్తున్నారు. ఏది ఏమైనా బెబ్బులి జాడ కోసం అటవీ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. పులికి ప్రమాదం జరిగితే అధికారులకు ఇబ్బందులు తప్పవన్న ఉద్దేశంతో అడవుల్లో ప్రత్యేక సిబ్బంది చేత చర్యలు చేపడుతున్నారు.



కాంగ్రెస్‌లో పదవుల కోలాహలం




- సంబురపడుతున్న శ్రేణులు
- వరుస పదవులతో పటిష్ఠ దిశగా పార్టీ
- సీనియర్‌లకు పెద్దపీట
- ఇక మిగిలిన పదవుల భర్తీకి రంగం సిద్ధం
- నేడు భాధ్యతలు చేపట్టనున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమన్ ఆలీ

నిర్మల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వరుసగా నామినేటేడ్ పదవుల పంపిణీ జరుగుతుండడంతో ఆ పార్టీ శ్రేణుల్లో సంబురాలు వెల్లువెత్తుతున్నాయి. అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన చాలా మంది సీనియర్ నాయకులు, కార్యకర్తలు గత తొమ్మిది నెలల నుంచి ఎదురుచూస్తున్న నామినేటేడ్ పదవులు ఒక్కొక్కరినీ వరిస్తుండడంతో ఆ పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంటోంది. జిల్లాలోని ఐదు మార్కెట్ కమిటీలకు చైర్మన్ పదవులతో పాటు వైస్ చైర్మన్, డైరెక్టర్ పదవుల కోసం చాలా మంది సీనియర్ నేతలు పెట్టుకున్న ఆశలు ఫలిస్తున్నాయి. అయితే కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆయా నియోజకవర్గాల పార్టీ ఇన్‌చార్జీలు సిఫారసు చేసిన వారికే పదవులు ఇవ్వాలని నిర్ణయించడంతో ఆశవాహులకు పదవులు దక్కుతున్నట్లు చెబుతున్నారు. అయితే ఇప్పటికే నియోజకవర్గ ఇన్‌చార్జీలు తమ పరిధిలోని మార్కెట్ కమిటీల పాలకవర్గాలకు సంబంధించిన పేర్లను సంబంధిత మంత్రి ద్వారా వ్యవసాయ మార్కెటింగ్ శాఖకు అందించారు. రెండు మూడు రోజుల్లో ప్రస్తుతం నియామకాలు పూర్తికాని మార్కెట్ చైర్మన్ పదవులు కూడా భర్తీ కాబోతున్నాయి. కాగా ఇప్పటికే జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ నాయకులు అర్జుమన్‌ను నియమించారు. అర్జుమన్ అలీ కాంగ్రెస్ పార్టీకి మొదటి నుంచి వెన్నుదన్నుగా నిలుస్తూ శ్రేణులను ముందుకు నడిపిస్తున్నారు. పార్టీ కష్ట కాలంలో ఉన్న సమయంలో ఆయన కేడర్‌ను ముందుండి నడిపారు. మైనారిటీ వర్గం నుంచి ప్రస్తుతం ఆయన బలమైన నేతగా గుర్తింపు పొందారు. దీంతో పాటు సీఎం రేవంత్‌రెడ్డికి అలాగే పీసీసీ ప్రసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్‌తో పాటు మంత్రి సీతక్క, సీనియర్ నేత షబ్బీర్ అలీలకు కూడా ఆయన సన్నిహితుడు కావడం గమనార్హం. కాగా ఈయన సీనియారిటీని ప్రతిపాదికగా చేసుకొని అధిష్టానం ఆయనకు గ్రంథాలయ సంస్థ చైర్మన్ బాధ్యతలను అప్పజెప్పింది. శుక్రవారం ఆయన అట్టహాసంగా పదవీ బాధ్యతలను చేపట్టబోతున్నారు. ఈ కార్యక్రమానికి పీసీసీ ప్రసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్, డీసీసీ అధ్యక్షులు శ్రీహరి రావు, మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డిలతో పాటు తదితరులు హాజరుకానున్నారు. అలాగే నిర్మల్ పట్టణంలోని చారిత్రక మహాలక్ష్మి కమిటీ చైర్మన్‌గా కొడుకుల శ్రీకాంత్‌ను అలాగే దేవరకోట దేవస్థానం చైర్మన్‌గా కొండ శ్రీనివాస్‌ను సైతం ఇప్పటికే నియమించారు. వీరితో పాటు నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా సీనియర్ నేతలు భీంరెడ్డి, సారంగాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఆదిలను నియమించగా వారు ఇప్పటికే బాధ్యతలు చేపట్టారు. అలాగే భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్‌గా సీనియర్ నేత ఆనంద్‌రావు పటేల్‌ను రెండు రోజుల క్రితం ప్రభుత్వం నియమించింది. కాగా ప్రసిద్ధి గాంచిన అడెల్లి పోచమ్మ ఆలయ పాలకవర్గం నియామకంతో పాటు కుభీర్, ఖానాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులను కొద్ది రోజుల్లోనే నియమించబోతున్నారు.

కుభీర్, ఖానాపూర్ మార్కెట్ కమిటీలకు పోటాపోటీ

కాగా జిల్లాలోని ఐదు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులకు కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నేతలంతా తీవ్రంగా పోటీ పడుతుండడంతో నియామకాల వ్యవహారం ఆసక్తిని రేకెత్తిస్తోంది. పార్టీ సీనియర్ నాయకులు, డీసీసీ చైర్మన్ శ్రీహరిరావుకు అత్యంత సన్నిహితులైన మేడిపెల్లి భీంరెడ్డి, అబ్దుల్ ఆదిలు నిర్మల్, సారంగాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులను చేపట్టడంతో మిగతా సీనియర్ నాయకులంతా ఈ నామినేటేడ్ పదవుల కోసం తమవంతు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. అధిష్టానం నుంచి నియామకాలకు సంబందించిన సంకేతాలు వెలువడుతుండడంతో వీరు నియోజకవర్గ ఇంచార్జీలను కలిసి పదవులపై ఒత్తిడి పెంచుతున్నారు. కాగా ఖానాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం చాలా మంది సీనియర్ నాయకుల పోటీ పడుతున్నారు. అయితే అక్కడి ఎమ్మెల్యే వెడ్మబొజ్జు సూచించిన వారికే చైర్మన్ పదవితో పాటు వైస్ చైర్మన్, డైరెక్టర్ పదవులు దక్కనున్నాయి. ఇప్పటికే ఇక్కడి జాబితాను కూడా సంబందిత శాఖకు చేరుకుందని అంటున్నారు. దీంతో పాటు ముథోల్ నియోజకవర్గంలోని కుభీర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులకు కూడా తీవ్రమైన పోటీ నెలకొందని చెబుతున్నారు. అయితే ఇక్కడి నియోజకవర్గ ఇన్‌చార్జీ నారాయణరావు పటేల్ కుభీర్ మార్కెట్ కమిటీ పాలకవర్గానికి సంబందించి పేర్ల జాబితాను అధిష్టానానికి పంపించడమే కాకుండా ఆ జాబితాకు ఆమోదం ముద్ర కూడా వేయించినట్లు చెబుతున్నారు.


అర్జుమన్ ఆలీ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్


మేడిపెల్లి భీంరెడ్డి, నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్



దేవాలయాల పాలకవర్గాలకు సైతం

జిల్లాలోని చారిత్రక అడెల్లి పోచమ్మ ఆలయం పాలకవర్గాలకు సంబందించి నియామక ప్రక్రియ కూడా వారం రోజుల్లోగా ఖరారు కానుందని చెబుతున్నారు. ఇప్పటికే మహాలక్ష్మి ఆలయ కమిటీ చైర్మన్‌గా కొడుకుల శ్రీకాంత్‌ను నియమించగా దేవరకోట శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా కొండ శ్రీనివాస్‌లను నియమించారు. కాల్వ లక్ష్మినర్సింహ స్వామి ఆలయ కమిటీ, కదిలి పాపహరేశ్వర స్వామి ఆలయ కమిటీల నియామకాలు కూడా కొద్ది రోజుల్లోనే పూర్తికానున్నాయంటున్నారు. మొత్తానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలకే పదవుల నజరానాలు అందతుండడంతో ఆ పార్టీ శ్రేణుల్లో సంబురాలు నెలకొంటున్నాయి.



పర్యాటకరంగ అభివృద్ధికి చర్యలు చేపట్టాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నిర్మల్ అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : పర్యాటక రంగ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రసిద్ధ దేవాలయాలు, చారిత్రాత్మక కట్టడాలు, పర్యాటకరంగ అభివృద్ధిపై సంబంధిత అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... పర్యాటకరంగ అభివృద్ధికి పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలోని పర్యాటక ప్రదేశాలను గుర్తించి అవసరమైన సౌకర్యాలు, సుందరీకరణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర స్థాయి హిస్టారికల్, టూరిజం అధికారుల సమన్వయంతో జిల్లాలోని ప్రసిద్ధ దేవాలయాలు, చారిత్రాత్మక కట్టడాలు, పర్యాటక ప్రదేశాలు, ప్రాజెక్టులు, జలపాతాలను మరింత అభివృద్ధి చేసేలా ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. బాసర సరస్వతీదేవి, అడెల్లి పోచమ్మ, సదర్‌మాట్ బ్యారేజ్, స్వర్ణ, కడెం, గడ్డెన్నవాగు ప్రాజెక్టులను సందర్శించే పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. జిల్లా స్థాయి టూరిజం కమిటీని ఏర్పాటు చేసి, పర్యాటకరంగ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పర్యాటక ప్రదేశాలపై ఫోటో, డాక్యుమెంట్ పోటీలను నిర్వహించాలని, మేధావులు, విద్యావంతులు, ప్రముఖులతో సంప్రదించి పర్యాటకరంగం అభివృద్ధికి వారి సూచనలు, సలహాలు తీసుకోవాలన్నారు. జిల్లా పర్యాటక ప్రాంతాలకు విస్తృతంగా ప్రచారం కల్పించడం కోసం ట్విట్టర్, ఫేస్ బుక్, ఇంస్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమ సాధనాలను ఉపయోగించుకోవాలని తెలిపారు. పర్యాటక కేంద్రాల వద్ద మెరుగైన పారిశుద్ధ్యం, మరుగుదొడ్లను నిర్వహించాలన్నారు. అనంతరం బాసర సరస్వతీ ఆలయ అభివృద్ధిపై చర్చిస్తూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మెరుగైన వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గోదావరి నది వద్ద భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, పర్యాటక శాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, సీపీవో జీవరత్నం, మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, బాసర ఆలయ ఈవో విజయ రామారావు, ఈడీఎం నదీమ్, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలి

అర్హులైన ప్రతి ఒక్కరూ ఉపాధ్యాయ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ పేరును నమోదు చేసుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... గత ఎన్నికల్లో ఓటరుగా తమ పేరు నమోదు చేసుకున్నప్పటికిని, ఈ ఎన్నికల్లో కూడా కొత్తగా తమ పేరును నమోదు చేసుకోవాలన్నారు. వీలైనన్ని ఎక్కువ దరఖాస్తులు వచ్చే విధంగా ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో ఓటరుగా తమ పేరును నమోదు చేసుకోవచ్చని, ఆఫ్ లైన్ విధానంలో అయితే తహసీల్దార్ లేదా ఆర్డీవో కార్యాలయాల్లో సంబంధిత దరఖాస్తు ఫారమ్‌లు నింపి అర్హత పత్రాలు జత చేసి కార్యాలయాల్లో అందజేయాలన్నారు.


సమావేశానికి హాజరైన అధికారులు